క్లుప్తంగా

సింహగిరిపై తిరునక్షత్రం పూజలు



తిరునక్షత్రం పూజలో పారాయణం చేస్తున్న స్థానాచార్యులు తదితరులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ మహాముని తిరునక్షత్రం పూజలు రెండవ రోజు ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం చేశారు. విశేష హారతులందించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 6వ తేదీతో తిరునక్షత్రం పూజలు ముగియనున్నాయి.

బెల్ట్ దుకాణంపై దాడి

29 మద్యం బాటిళ్ల స్వాధీనం, ఒకరి అరెస్ట్

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీ నందవరపువానిపాలెంలో ఓ బెల్ట్ దుకాణంపై ఆదివారం పెందుర్తి పోలీసులు దాడి చేశారు. బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న పి.రాముని అదుపులోనికి తీసుకుని 29 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అబాకస్‌తో విద్యార్థుల ఆలోచనకు పదును

స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: అబాకస్ పోటీల వల్ల విద్యార్థుల ఆలోచనకు పదును పెడతారని తద్వారా వారిలో సృజనాత్మకత మరింత మెరుగవుతుందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)యు. శ్రీధర్ అన్నారు. మ్యాథ్స్ టు మెరిట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు వివిధ రాష్ట్రాల నుంచి ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయసు కలిగిన సుమారు 450 విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఈపూరి సుధారాణి మాట్లాడుతూ ఏడాదికోసారి చొప్పున 15 ఏళ్ల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అబాకస్ వల్ల జ్ఞాపకశక్తితో పాటు మనసులో లెక్కలు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈపూరి బుచ్చిరాజు, యోగేష్‌కుమార్ గార్గ్, ఆకుండి రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

గాజువాక: తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీరుపై ధ్వజమెత్తారు. కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించవద్దని, పనులు కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ పేరుతో చేపడుతున్న వైద్య పరీక్షలను వెంటనే నిలిపివేయాలని, ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు, యు.రామస్వామి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097

అందాల తీరం.. అభివృద్ధికి దూరం

చుట్టూ కొండా కోనలు.. పచ్చని జీడిమామిడి తోటలు.. ముచ్చటగొలిపే ఇసుక తిన్నెలు.. సముద్రపు అలలపై నుంచి వచ్చే గాలితెమ్మెరలు.. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల సొంతం. తిక్కవానిపాలెం తీరంలో సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన జెట్టి, సీ వాటర్ పార్క్, సిమెంట్ గొడుగులు పర్యాటకులకు అదనపు ఆకర్షణ. ఇంతటి సుందర తీరప్రాంతాలు అభివృద్ధికి, ఇక్కడికి వచ్చే పర్యాటకుల కనీస అవసరాల తీర్చేందుకు ఆమడ దూరంలో ఉన్నాయి.

- కనీస సౌకర్యాల్లేని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు
- కార్తీకమాసం, మాఘపౌర్ణమిలో భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువ
- ఆదివారాలు, సెలవు రోజుల్లో యువత సందడి
- నిలువ నీడ లేదని పర్యాటకుల ఆవేదన



సందర్శకులను ఆకట్టుకునే తిక్కవానిపాలెం తీరంలో అతి పొడవైన జెట్టి



ముత్యాలమ్మపాలెం: విశాలమైన సముద్ర తీరం



తిక్కవానిపాలెంలోని సీ వాటర్ పార్క్

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరప్రాంతాల అందాలు పరిసర ప్రాంతవాసులనే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పట్టణ, గ్రామీణ ప్రాంతాల సందర్శకులనూ కట్టిపడేస్తాయి. కార్తీక మాసం, మాఘపౌర్ణమి వంటి పుణ్య దినాల్లోనైతే చెప్పాల్సిన పనేలేదు. ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో యువత తీర ప్రాంతాలకు చేరి ఇసుక తిన్నెలపై ఆట పాటలతో రోజంతా సందడి చేస్తారు. సాయంత్రం వరకు సముద్రంలో జలకాలాటలతో ఉల్లాసంగా గడుపుతారు. ఈ తీర ప్రాంతాల్లో ఇన్ని అందాలున్నా.. కనీస సౌకర్యాలేక పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.

భక్తులకు వసతులు పూజ్యం

తీర ప్రాంతాలకు రాకపోకలకు అనువైన రోడ్డు మార్గాలు, బస్సు, ఆటోల సౌకర్యం ఉంది. గాజువాక, అనకాపల్లి పట్టణ ప్రాంతాలతో పాటు సబ్బవరం, పరవాడ, పెందుర్తి ప్రాంతాల నుంచి ఎక్కువగా సందర్శకులు వస్తుంటారు. మాఘపౌర్ణమి జాతర, కార్తీక మాసంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని మాధవస్వామిని దర్శించుకుంటారు. కార్తీకమాసంలో ప్రతి సోమవారం భక్తులు భారీగా వచ్చి, పుణ్యస్నానాలు ఆచరించి శివ పార్వతులను పూజిస్తారు. ఈ భక్తులకు అవసరమైన కనీస వసతులు కూడా ఇక్కడ లేవు. తాగునీరు, అలసట తీర్చుకునేందుకు నీడతో కూడిన వసతి, వంటా వార్పులకు అవసరమైన షెడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు.

రెండూ.. రెండే

పరవాడ పరిధిలోని ఇరు తీరప్రాంతాలూ వేటికవే సాటి. తిక్కవానిపాలెం తీరంలో సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన సీ వాటర్ పార్క్, అతి పొడవైన జెట్టీ, సువిశాలమైన ఇసుక తిన్నెలు, సందర్శకులు సేదదీరేందుకు నిర్మించిన సిమెంట్ గొడుగులు ప్రత్యేక ఆకర్షణలు. సీ వాటర్ పార్క్‌లో కూర్చుని తీరం అందాలను ఆస్వాదించడం అదో మధురానుభూతి. ముత్యాలమ్మపాలెం తీరం పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకలు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు చాలా అనువైన ప్రాంతం. పచ్చని కొండాకోనలు, గలగల పారే ఉప్పు నీటి సవ్వడులు, ఆట పాటలకు అనువైన ఆట స్థలం, సముద్ర స్నానాలకు చాలా అనుకూలం. అందుకే ఈ ప్రాంతాలకు పర్యాటక తాకిడి ఎక్కువ.

సమస్యలు బోలెడు..

- తిక్కవానిపాలెం తీరంలో దాహం తీర్చుకోవాలంటే చాలా దూరం వెళ్లాలి. చేతి పంపుగానీ, కొళాయి సౌకర్యంగానీ ఇక్కడ లేవు.
- కొన్ని సమయాల్లో భక్తులు ఇక్కడికి వచ్చి, వంటావార్పు చేసుకుంటారు. షెడ్లు లేకపోవడంతో జెట్టీ కిందే సరిపెట్టుకుంటున్నారు.
- తీరంలో ప్రమాదాలను అరికట్టేందుకు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసు గస్తీ ఉండాలి. మందుబాబుల ఆగడాలను అరికట్టాలి.
- తీరంలో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.
- ముత్యాలమ్మపాలెం తీరంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. తీరం వద్ద ఏర్పాటు చేసిన కొళాయి మరమ్మతులకు గురైంది.
- తీరంలో కాసేపు కూర్చుని, అలసట తీర్చుకునేందుకు నీడనిచ్చే ఏర్పాట్లు లేవు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



బీచ్‌ల అందాలు ఎప్పుడూ బోర్ కొట్టవు. అలాంటి తీర ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు పాలకులు కృషి చేయాలి. చూడ చక్కని ప్రదేశాలు ఉన్నప్పటికీ, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎండా వానల నుంచి రక్షణ పొందడానికి ఇక్కడున్న సిమెంట్ గొడుగులు సరిపోవట్లేదు.

– పోలారపు సుబ్రహ్మణ్యం, అచ్యుతాపురం

తాగునీటి సౌకర్యం ఏదీ?



సుందర తీర ప్రాంతాల అందాలను ఆస్వాదించడానికి వస్తున్న వారికి దాహం తీర్చుకునే దారే లేదు. మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. తాగి పడేసిన మద్యం సీసాలతో ప్రమాదాల బారిన పడుతున్నాం. తీరంలో ప్రమాదాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జెట్టి గణేష్, పర్యాటకుడు, సబ్బవరం

పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తాం



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తాం. కార్తీక మాసంలో సముద్రంలో స్నానాలు ఆచరించే వారికి అవగాహన కల్పిస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

ఘనంగా ‘కాశీలో కార్తీకం’

గంగానదికి పూజలు చేసిన శారదా పీఠాధిపతి



కాశీలో కార్తీకం కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీలు

పెందుర్తి: శారదాపీఠం ఆధ్వర్యంలో కాశీలో తలపెట్టిన కాశీలో కార్తీకం.. తరతరాలకు తరగని పుణ్యఫలం కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు గంగానదీ స్నానమాచరించి విశేష పూజలు జరిపారు. అనంతరం కేదార్‌నాథ్ ఆలయంలో ప్రత్యేక అర్చనలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ యాగశాల ప్రవేశం చేశారు. కర్ణాటక నుంచి వచ్చిన అవధాని కేశవ్ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు జరిపారు. వివిధ సంప్రదాయాలకు చెందిన స్వామీజీలు, మహంతులు, పీఠాధిపతులు తరలివచ్చారు. కార్యక్రమంలో శ్రీరామ తారక ఆంధ్ర ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వీవీ సుందరశాస్త్రి, కంచి మఠం మేనేజర్ సుబ్రమణియన్ మణి తదితరులు పాల్గొన్నారు.



గంగానదికి పూజలు చేస్తున్న స్వామీజీ

శివాలయాలకు కార్తీక శోభ



పరవాడలో ముస్తాబైన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం



పెదయాతపాలెం గౌరీ పరమేశ్వరుల క్షేత్రం



తాడి శివాలయంలో కొలువుదీరిన నీలకంఠుడు

పరవాడ: కార్తీక మాసం పూజలకు పరవాడ మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలకు భక్తులు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలో పరవాడలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం, తాడిలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం, భర్నికం, లేమర్తి, నాయుడుపాలెం, దేశపాత్రునిపాలెం, దీపాంజలినగర్ ప్రాంతాల్లోని శివాలయాల్లో నెల రోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. పరవాడ శివాలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయం ఎదుట షామియానాలు, సోమవారం నుంచి ఆలయంలో అభిషేక పూజలు, హోమంల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

సబ్బవరం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం, ఇరువాడలోని స్వయంభూ భీమలింగేశ్వరస్వామి ఆలయం, సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, వంగలిలోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయాలు కార్తీకమాస తొలి సోమవారం పూజలకు సిద్ధమయ్యాయి. కార్తీక సోమవారాల్లో భక్తులు పోటెత్తనుండటంతో ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

- పెదయాతపాలెంలోని గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శరగడం శంకరరావు మీడియాకు తెలిపారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దీపం పథకం-2ను సద్వినియోగం చేసుకోండి

సబ్బవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం పథకం-2ను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌డీటీ లీలా శేషుకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ కనెక్షన్ నెంబర్ తదితర వివరాలన్నీ ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉన్నాయన్నారు.

ఈ పథకం లబ్ధిదారులు గ్యాస్ ధరను ముందుగానే చెల్లించాలని, సిలిండర్ అందిన 48 గంటల్లోగా చెల్లించిన ధర లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందన్నారు. మొదటి సారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలనుకునే లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందన్నారు. ఏప్రిల్–జూలైలో ఒకటి, ఆగస్టు–నవంబర్ మధ్య మరొకటి, డిసెంబర్–మార్చి మధ్య ఇంకొక సిలిండర్ ఉచితంగా అందుకోవచ్చన్నారు. ఉచిత గ్యాస్ బుకింగ్ సమస్యలుంటే గ్రామ/వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేసే వెసులుబాటు త్వరలోనే కల్పించనున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులకు ఈకేవైసీ తిప్పలు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం పథకం–2 ఈకేవైసీ ప్రక్రియ మండలంలోని గ్యాస్ వినియోగదారులకు చుక్కలు చూపిస్తోంది. మండలంలో ఒక్క గ్యాస్ ఏజెన్సీ కూడా లేదు. పెందుర్తి, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లో ఉన్న ఏజెన్సీల నుంచే మండలంలోని వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. దీంతో దీపం పథకం కోసం ఆయా ఏజెన్సీలు స్పెషల్ డ్రైవ్ పెట్టి, ఈకేవైసీ చేయించాలని మండల వినియోగదారులు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యాటకుల తాకిడి

పరవాడ: కార్తీకమాసానికి తోడు ఆదివారం కావడంతో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో సందర్శకుల తాకిడి భారీ నెలకొంది. అనకాపల్లి, గాజువాక, సబ్బవరం, పరవాడ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనాలతో కిటకిటలాడింది. ఉదయం నుంచే తీరాలకు చేరుకున్న సందర్శకులు తీరం అందాలను ఆస్వాదించడమే కాకుండా ఇసుక తిన్నెలపై కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ వంటి ఆట పాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. సాయంత్ర వరకు సముద్రంలో స్నానాలు చేస్తూ ఆనందించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శాప్ చైర్మన్ రవినాయుడు



అప్పన్న సన్నిధిలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ ఎ.రవినాయుడు, రాష్ట్ర హౌసింగ్‌బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందజేశారు. శాప్ చైర్మన్ వెంట అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ సతివాడ శంకరరావు ఉన్నారు.

• మేహాద్రిలో మత్స్యవేట



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ఏర్పడి దాదాపు నాలుగు దశాబ్దాలవుతోంది. అప్పట్లో మేహాద్రి కోసం భూములు కోల్పోయిన రైతుల్లో చాలా మంది అదే రిజర్వాయర్లో చేపల వేటతో జీవనోపాధి పొందుతున్నారు. ఏటా వర్షాలు కురిసి, మేహాద్రి నిండే సమయంలో మత్స్య వేటతో వీరి ఆదాయం కాస్త బాగుంటుంది. ఈ ఏడాది మేహాద్రిలో నీటి నిల్వలు బాగానే చేరాయి. దీంతో చేపల వేట మొదలయింది. ఆదివారం తొలి వేకువ సమయంలో మేహాద్రి ప్రధాన కాలువలో నాటు పడవపై చేపల వేటకు బయల్దేరిన రైతును సాక్షి క్లిక్‌మనిపించింది.

– పెందుర్తి

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి వినతి



పల్లా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్యని పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లుగా పంచగ్రామాల భూసమస్యతో రైతులు, నివాసితులు, ఖాళీస్థలాలున్నవారు పడుతున్న ఇబ్బందుల్ని వివరించారు. దేవస్థానం అధికారుల చర్యల్ని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. సమస్య కోర్టు ద్వారానే పరిష్కారం అవుతుందని, సింహాచలం దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూమిని అందించనున్నట్లు పేర్కొన్నారు. కొద్ది నెలల్లోనే సమస్య పరిష్కారం అవుతుందని భరోసానిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు వీబీఎస్ ప్రతాప్, ఉపాధ్యక్షుడు బి.శంకర్‌రావు, కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ, నాయకులు పల్లా పెంటారావు, హనుమంతరావు,పేరి రాంబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆహ్లాదం చెంతన.. ఆధ్యాత్మిక చింతన

- పిక్నిక్ స్పాట్లుగా ఆధ్యాత్మిక కేంద్రాలు
- మొదలైన కార్తీక వనభోజనాల సందడి



పెందుర్తి సాధుమఠం వద్ద వనభోజనాల సందడి(ఫైల్)



సబ్బవరంలో ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురం

పెందుర్తి: కార్తీక మాసం మొదలైందంటే వనభోజనాల సందడే సందడి. ఈ నెలంతా పర్యాటక కేంద్రాలు జనంతో కిటకిటలాడుతుంటాయి. ఈ మాసంలో కుటుంబ సమేతంగా దైవ దర్శనానికి వెళ్లి, అక్కడే సహపంక్తి భోజనం చేస్తే మంచిదని ప్రజల విశ్వాసం. పెందుర్తి నియోజకవర్గంలో పూజలతో పాటు బంధుమిత్ర, సకుటుంబ, సపరివార సమేతంగా వన భోజనాలు ఆరగించేందుకు అనువైన ప్రాంతాలు చాలా ఉన్నాయి. కార్తీకమాసం తొలి సోమవారం నుంచే పిక్నిక్‌ల సందడి మొదలుకానుంది.

సాధుమఠం.. పురాతన ఆధ్యాత్మిక కేంద్రం

పెందుర్తి కూడలికి కిలోమీటరు దూరంలో ఉన్న సాధుమఠం ఏర్పడి శతాబ్దం దాటినట్లు పెద్దలు చెబుతారు. ఇక్కడి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న శివుడు చాలా మహిమ గలవాడని ప్రజల విశ్వాసం. పశ్చిమ ముఖంగా ఉన్న ఏకైక శివాలయం ఇది. కార్తికమాసంలో నిత్యం ఈ ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతుంది. సమీపంలోని తోటలు వన భోజనాలకు అనువుగా ఉంటాయి. మఠం ప్రాంగణంలో ఉన్న ఉసిరి, రావి చెట్ల కింద కూర్చుని భోజనాలు చేయడానికి భక్తులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఏటా కార్తీక మాసంలో పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నగరం నుంచి కూడా ఇక్కడకు వస్తుంటారు. ప్రస్తుతం సాధుమఠానికి పూర్వవైభవం తెచ్చేందుకు ఆధునికీకరణ పనులు చేపట్టారు. నగరం నుంచి 300 రూట్ నెంబర్ బస్సులన్నీ ఇక్కడ ఆగుతాయి. పెందుర్తి కూడలి నుంచి ఆటోల సౌకర్యం ఉంది.

అతి పెద్ద పిక్నిక్ స్పాట్ దేవీపురం

జిల్లాలోనే అతిపెద్ద పిక్నిక్ స్పాట్‌గా ప్రసిద్ధికెక్కిన దేవీపురంలో వనభోజనాల సందడి మొదలైంది. ఆదివారం ఈ ప్రాంతం సందర్శకులతో కిటకిటలాడింది. ఇక్కడి శ్రీమేరు క్షేత్రం ప్రపంచ ప్రసిద్ధి. రాజరాజేశ్వరీమాతను దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడికి తరలివస్తారు. ఇక్కడి తోటలు వనభోజనాలకు చాలా సౌకర్యంగా ఉంటాయి. ఏటా కార్తీకమాసంలో వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి వస్తుంటారు. వీటితోపాటు పెందుర్తిలోని వేంకటాద్రి, పినగాడిలోని చౌడేశ్వరస్వామి దేవాలయం, సరిపల్లిలోని శివాలయం ప్రాంగణాలు పిక్నిక్ స్పాట్లుగా అలరారుతున్నాయి. పరవాడలోని ముత్యాలమ్మ పాలెం సముద్రతీరం కూడా వన భోజనాలకు ప్రసిద్ధి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com